ప్రభాత jayabheridaily.com
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
22-06-2024
శనివారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 299 | పేజీలు : 8 | వెల : 4

జయభేరి దినపత్రిక
జయభేరి చానల్లో
నికార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా..
ఆసక్తి కలిగిన యువతీ
యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత
jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889




# కాంగ్రెస్ లో చేరిన పోచారం

మాజీ స్పీకర్, బీఆర్ఎస్ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతోపాటు కుమారుడు భాస్కర్‌రెడ్డి కూడా పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. తెలంగాణ వచ్చి పదేళ్లు పూర్తైన తర్వాత కొత్త ప్రభుత్వం ఏర్పడింది. జరుగుతున్న పరిణామాలూ చూసిన తర్వాత నిర్ణయం తీసుకున్నాం. రేవంత్ రెడ్డినే తానే ఆహ్వానించినట్టు పేర్కొన్నారు. రైతు బిడ్డగా ఆయన సంస్కరణలు నచ్చే పార్టీలో చేరాను. మంచి పనులకు అండగా ఉండి రైతు బాగుపడాలని ఆకాంక్షతో రేవంత్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరాం.

**జయభేరి, హైదరాబాద్, జూన్ 21:**

మాజీ స్పీకర్, బీఆర్ఎస్ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతోపాటు కుమారుడు భాస్కర్‌రెడ్డి కూడా పార్టీలో చేరారు. పార్టీలో చేరికల అనంతరం మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి... తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా పోచారం శ్రీనివాస్ రెడ్డిని కలిసి పార్టీలోకి ఆహ్వానించామన్నారు. అండగా పెద్దలు నిలబడాలని కోరినట్టు వెల్లడించారు. తెలంగాణ రైతుల సంక్షేమం కోసం పోచారం కాంగ్రెస్‌లో చేరారని తెలిపారు. "రైతుల సంక్షేమంపై వారి సలహాలు సూచనలు తీసుకుని ముందుకెళతాం. రైతు రుణమాఫీ విధివిధానాలపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోబోతున్నాం. భవిష్యత్‌లో పోచారం శ్రీనివాస్ రెడ్డికి సముచిత గౌరవం ఇస్తాం. నిజామాబాద్ జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఆయన సహకారం తీసుకుంటాం. ఇది రైతు రాజ్యం.. రైతు సంక్షేమ రాజ్యం.. రైతు సంక్షేమం కోసం అవసరమైన అందరినీ కలుపుకుని పోతాం." అని రేవంత్ కామెంట్స్ చేశారు. ఈ ఉదయం పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇంటికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,

...మిగతాది 2 లో

# యోగా విద్యనే కాదు విజ్ఞానం కూడా



యోగా అనేది ప్రాచీన విద్యనే కాదు. విజ్ఞానం కూడా అని ప్రధాని మోదీ అన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో యోగా డేలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. యోగాకు జమ్మూకశ్మీర్ నిలయం. ప్రపంచంలో యోగా అనేది ఇప్పుడొక కొత్త ట్రెండ్. యోగా గురించి తెలుసుకునేందుకు ఇండియాకు వస్తున్నవారి సంఖ్య పెరుగుతోంది అని తెలిపారు.

# జయశంకర్ త్యాగాలు మరువలేనివి



**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం తన జీవితాన్ని అర్పించిన సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. నేడు జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు. పదేళ్లపాటు కొనసాగిన బీఆర్ఎస్ ప్రగతిపాలనలో జయశంకర్ స్ఫూర్తి ఇమిడి ఉంది. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ నేటి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఆత్మ గౌరవాన్ని మరింతగా ఇనుమడింపజేసే దిశగా పాలన అందించిననాడే వారికి ఘన నివాళి అర్పించినవారమవుతాం అని తెలిపారు.




# సీబీఐ విచారణ కోరే దమ్ముందా?

- కాంగ్రెస్ కు కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్
- సింగరేణిని ప్రైవేటీకరించి దివాళా తీయించింది కేసీఆరే
- సింగరేణిలో కేంద్రం వాటా 49, రాష్ట్రం వాటా 51 శాతం మాత్రమే
- రాష్ట్ర ఆమోదం లేకుండా కేంద్రం ప్రైవేటీకరించడం అసాధ్యం
- తప్పుడు ప్రచారంతో ప్రజల్లో అయోమయం సృష్టించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్ర
- అవినీతి విషయంలో బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోంది
- ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం విచారణ పేరుతో జాప్యం చేయడమే తప్ప చేసిందేమీ లేదు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు
- ప్రధాని కృషి వల్లే యోగాను అంతర్జాతీయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని వెల్లడి

# నితీష్ కుమార్ ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ



**జయభేరి, పాట్నా జూన్ 21:**

బీహార్‌లో నితీష్ కుమార్ ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ లో నితీష్ కుమార్ ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దళితులు, వెనుకబడిన తరగుతుల, గిరిజనులకు రిజర్వేషన్ కోటాను 50 శాతం నుంచి 65 శాతానికి పెంచాలని గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పాట్నా హైకోర్టు గురువారం కొట్టివేసింది. రిజర్వేషన్ కోటాను పెంచుతూ 2023 నవంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై చీఫ్ జస్టిస్ కె వినోద్ చంద్రన్ నేతృత్వంలోని పాట్నా హైకోర్టు డివిజన్ బెంచ్ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. బీహార్‌లో కులాలపై సమగ్ర సర్వే జరిపిన రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసి, ఇబిసిల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కోటాను 50 నుంచి 65 శాతానికి పెంచుతూ కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థలలో ఈ అణగారిన వర్గాలకు రిజర్వేషన్ కోటాను 50 నుంచి 65 శాతానికి పెంచుతూ గత ఏడాది నవంబర్ 21న ఒక గెజిట్ నోటిఫికేషన్‌ను నితీష్ కుమార్ ప్రభుత్వం జారీచేసింది.

...మిగతాది 2 లో

# అరవింద్ కేజ్రీవాల్ బెయిల్ రద్దు




# సిబిఐ ప్రత్యేక కోర్టులో కవితకు ఎదురుదెబ్బ

**జులై 5వరకు కస్టడీ పొడిగిస్తూ సిబిఐ ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు జారీ**




# జగన్ ప్రమాణ స్వీకారం


- ప్రమాణస్వీకారం చేసిన వెంటనే సభలో ఉండకుండా ఛాంబర్ కు పయనమైన జగన్..!

**జయభేరి, అమరావతి:**



వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణం చేసిన అనంతరం జగన్ సభలో ఉండకుండా ఛాంబర్కు వెళ్లిపోయారు. అంతకుముందు అసెంబ్లీ వెనుక గేటు నుంచి ప్రాంగణంలోకి జగన్ వచ్చారు. గతంలో ఆయన సీడ్ యాక్సెస్ రోడ్డు నుంచి మందడం మీదుగా సభకు వచ్చేవారు. అమరావతి రైతులు నిరసన తెలుపుతారని భావించి వేరే మార్గంలో సభకు వచ్చినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ప్రాంగణంలోకి వచ్చినా ఆయన లోపలికి వెళ్లలేదు. సభ ప్రారంభమైన ఐదు నిమిషాల తర్వాత వెళ్లారు. తన ప్రమాణస్వీకార సమయం వచ్చినపుడే సభలో అదుగు పెట్టారు.

# హజ్ యాత్రలో 98 మంది భారతీయులు మృతి



జనరల్ న్యూస్
jayabheridaily.com
ప్రభాత జయభేరి

▶▶ మొదటిపేజీ తరువాయి

## కాంగ్రెస్ లో చేరిన పోచారం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కలిసి వెళ్లి పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. ఇప్పటికే ప్రాథమిక చర్చలు పూర్తి అయిన వేళ ఇవాళ మర్యాదపూర్వకంగా కలిసి పార్టీలో చేరాలని పిలుపునిచ్చారు. సుమారు రెండు గంటల చర్చల అనంతరం పార్టీలో చేరుతున్నట్టు మాజీ స్పీకర్ పోచారం మీడియాకు తెలిపారు.కాంగ్రెస్ నుంచే రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన పోచారం తర్వాత తెలుగుదేశం లోకి వచ్చారు. అక్కడ మంత్రిగా పని చేశారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో అప్పటి టీఆర్ఎస్‌లో చేరారు. రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత ప్రభుత్వంలో మంత్రి, స్పీకర్‌గా పని చేశారు. తెలుగు రాష్ట్రాల్లో స్పీకర్లు ఓడిపోతారనే అపవాదును పోచారం చెరిపేశారు. చాలా ఏళ్లు తర్వాత స్పీకర్‌గా పని చేసిన తర్వాత కూడా ప్రజలను మెప్పించి 2023 ఎన్నికల్లో విజయం సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో స్పీకర్లుగా పని చేసిన చాలా మంది ఓడిపోయారు. ఈయన మాత్రం చాలా కాలం తర్వాత గెలిచి రికార్డు బ్రేక్ చేశారు. రేవంత్ రెడ్డి చేపట్టిన రైతు సంస్కరణలు నచ్చి ఆపార్టీలో చేరుతున్నట్టు ప్రకటించారు. తనకు వయసు అయిపోయిందని తన లాంటి వాళ్లకు ఉన్న రాజకీయ భవిష్యత్ చాలా తక్కువని చెప్పారు. రేవంత్ రెడ్డి లాంటి యవ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తే మరిన్ని మంచి పనులు చేస్తారని అభిప్రాయపడ్డారు. అందుకే రేవంత్‌కు మద్దతుగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు స్పష్టం చేశారు. పోచారం నివాసంలో ఈ చర్చలు కొనసాగుతున్న టైంలోనే ఆయన ఇంటి బయట ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. బాల్క సుమన్ నేతృత్వంలో బీఆర్ఎస్ శ్రేణులు ఆయన ఇంటిని చుట్టుముట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో బెదిరించి బీఆర్ఎస్ నేతలను తీసుకుంటోందని ఆరోపించారు. ప్రజాసమస్యల నుంచి దారి మళ్లించేందుకు ప్రభుత్వం ఇలాంటి కుయుక్తులు పన్నుతోందని విమర్శిస్తూ నినాదాలు చేశారు. రేవంత్ రెడ్డి కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు బాల్కసుమన్ యత్నించారు. దీంతో పోలీసులకు బీఆర్ఎస్ నేతలకు మధ్య వాగ్వాదం జరిగింది. పరిస్థితి చేయిదాటిపోక ముందే నేతలను పోలీసులు అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు.

## అరవింద్ కేజ్రీవాల్ బెయిల్ రద్దు

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బెయిల్ దొరికి కాస్తంత ఊరట వచ్చిన వెంటనే కేజ్రీవాల్‌కి మరో షాక్ తగిలింది. రౌజ్ అవెన్యూ కోర్టు ఇచ్చిన బెయిల్‌పై హైకోర్టు స్టే విధించింది. ఈ పిటిషన్‌ని విచారించిన కోర్టు బెయిల్‌పై స్టే విధిస్తూ నిర్ణయం తీసుకుంది. లిక్కర్ స్కామ్ కేసులో అరెస్ట్ అయిన కేజ్రీవాల్‌కి రౌజ్ అవెన్యూ కోర్టు జూన్ 20న బెయిల్ మంజూరు చేసింది. దీనిపై ఈడీ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది.వెంటనే ఈ బెయిల్‌ని సవాల్ చేస్తూ ఈడీ హైకోర్టుని ఆశ్రయించింది.జస్టిస్ సుధీర్ కుమార్ జైన్, జస్టిస్ రవీందర్ దుడేజాతో కూడిన ధర్మాసనం ఈ స్టే ఇచ్చింది. అయితే..అంతకు ముందు మరో బెంచ్ మాత్రం స్టే విధించాలన్న ఈడీ పిటిషన్‌ని తోసిపుచ్చింది. కేసుని పూర్తిస్థాయిలో విచారించడంలో తమకు ఆటంకాలు ఎదురవుతున్నాయని, అందుకు అనుకూల వాతావరణం కల్పించడం లేదని అన్నారు. దీనిపై తమ వాదన వినిపించేందుకూ సమయం ఇవ్వలేదని అసహనం వ్యక్తం చేశారు. మనీలాండరింగ్ యాక్ట్‌లోని సెక్షన్ 45ని ప్రస్తావించిన అడిషనల్ సొలిసిటర్ జనరల్ బెయిల్‌పై స్టే విధించాలని కోరారు. దీనిపై ఇంకా విచారణ జరగాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. తిహార్ జైలు నుంచి కేజ్రీవాల్ విడుదల కావాల్సి ఉన్న హైకోర్టు స్టే ఇవ్వడం వల్ల ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. ఈ పిటిషన్‌పై మరో రెండు మూడు రోజుల పాటు విచారణ జరపాల్సి ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది. ఫలితంగా జూన్ 25వ తేదీ వరకూ కేజ్రీవాల్ జైల్‌లోనే ఉండనున్నారు. కేజ్రీవాల్‌కి వ్యతిరేకంగా సాక్ష్యాలు ఏమీ లేవని ట్రయల్ కోర్టు వ్యాఖ్యానించడాన్ని ఈడీ తరపున అడిషనల్ సొలిసిటర్ జనరల్ అసహనం వ్యక్తం చేశారు. అవాస్తవాల ఆధారంగా ట్రయల్ కోర్టు బెయిల్ ఇవ్వడం సరికాదని అన్నారు.

## కోర్టులో కవితకు ఎదురుదెబ్బ

సిబిఐ ప్రత్యేక కోర్టులో ఎంఎల్‌సి కవితకు ఎదురుదెబ్బ తగిలింది. లిక్కర్ పాలసీ సిబిఐ కేసులో కవితకు జ్యుడిషియల్ కస్టడీ పొడిగించారు. నేటితో ఎంఎల్‌సి కవిత జ్యుడిషియల్ కస్టడీ ముగియడంతో ఆమెను వర్చువల్‌గా కోర్టు ముందు అధికారులు హాజరుపరిచారు. జులై 5వరకు కస్టడీ పొడిగిస్తూ సిబిఐ ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కవిత జ్యుడీషియల్ రిమాండ్‌ను రౌస్ అవెన్యూ సిబిఐ ప్రత్యేక కోర్టు జూన్ 21వ తేదీ వరకు పొడిగించిన విషయం తెలిసిందే. జూన్ 3న ఈడీ అధికారులు వాదనలు పరిగణలోకి తీసుకున్న కోర్టు కవిత జ్యుడీషియల్ కస్టడీని జూలై 3వ తేదీ వరకు పొడిగించిన విషయం విధితమే.

## 98 మంది భారతీయులు మృతి

హజ్ యాత్రలో చనిపోయిన వాళ్లలో 98 మంది భారతీయులున్నారని భారత విదేశాంగ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఇవన్నీ సహజ మరణాలే అని వెల్లడించింది. ఇప్పటి వరకూ హజ్ యాత్ర కోసం లక్షా 75 వేల మంది సౌదీకి వెళ్లారని స్పష్టం చేసింది. అక్కడి భారతీయులకు ఎలాంటి సాయం అందించేందుకైనా సిద్ధంగానే ఉన్నామని ప్రకటించింది. ఇప్పటి వరకూ 10 దేశాలకు చెందిన దాదాపు 1,081 మంది యాత్రికులు ప్రాణాలు కోల్పోయినట్టు తేలింది. సరిగ్గా సౌదీలో వేసవి మొదలైనప్పుడే ఈ యాత్ర మొదలవుతుంది. ఫలితంగా అక్కడి వేడిని తట్టుకోలేక చాలా మంది చనిపోతున్నారు. గంటల కొద్ది నడుస్తూ యాత్ర చేస్తారు. ఈ కారణంగానే డీహైడ్రేషన్‌కి గురవుతున్నారు. ఈ వారంలో సౌదీలో ఉష్ణోగ్రతలు 51 డిగ్రీలకుపైగానే నమోదయ్యాయి.ఎండల కారణంగా చనిపోతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. సాధారణం కన్నా 30 రెట్లు ఎక్కువగా మరణాలు నమోదయ్యే ప్రమాదముందని హెచ్చరించింది. కేంద్ర ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. హజ్ యాత్రకు వెళ్లాలనుకునే భారతీయులు వైద్య సాయం ఎలా పొందాలో వివరిస్తూ ఓ డాక్యుమెంట్ విడుదల చేసింది. పూర్తిస్థాయి మెడికల్ కేర్ అందించనుంది. ఫిట్‌నెట్ సర్టిఫికేట్స్ కూడా ఇవ్వనుంది. హెల్త్ కార్డులు ఇవ్వడంతో పాటు వ్యాక్సిన్‌లు కూడా అందించి యాత్రలో ఎక్కడా ఆరోగ్య సమస్యలు రాకుండా జాగ్రత్త పడనుంది. కొన్ని కీలక ప్రాంతాల్లో హెల్త్ డెస్క్‌లు అందుబాటులోకి తీసుకురానుంది.

## నితీష్ కుమార్ కి గట్టి ఎదురుదెబ్బ

రజ్యాంగంలోని 14, 16, 20 అధికరణలను రాష్ట్ర ప్రభుత్వం తన గెజిట్ నోటిఫికేషన్ ద్వారా ఉల్లంఘించిందని, తాము చేసిన వాదనలపై విచారణ జరిపిన హైకోర్టు డివిజన్ బెంచ్ మార్చిలో తన తీర్పును రిజర్వ్ చేసిందని, ఈ రోజు తమ పిటిషన్లపై తీర్పును వెలువరించిందని పిటిషనర్ల తరపు న్యాయవాదులలో ఒకరైన రితికా రాణి తెలిపారు. కుల గణన ఆధారంగా తాము రిజర్వేషన్ కోటాను పెంచినట్లు రాష్ట్ర ప్రభుత్వం వాదించిందని, అయితే ఇంద్రా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులతోపాటు ఇటీవల మరాఠాల రిజర్వేషన్లకు సంబంధించిన కేసులో 50 శాతం గరిష్ఠ పరిమితికి మించి ఏ రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లను పెంచడానికి వీల్లేదని సుప్రీంకోర్టు ఇటీవల స్పష్టం చేసిన విషయాన్ని తాము ఉటంకించామని మరో పిటిషనర్ తరపు న్యయవాది నిర్భయ్ ప్రశాంత్ తెలిపారు. జనాభా గణాంకాల సేకరణలో భాగమైన ఎస్‌సి, ఎస్‌టిల జనాభా మినహాయించి మిగిలిన సామాజిక వర్గాల లెక్కలను సేకరించడంపై కేంద్రం నిస్సహాయతను వ్యక్తం చేసిన దరిమిలా బీహార్‌లో కులగణన నిర్వహించిన నితీష్ కుమార్ ప్రభుత్వం ఆ లెక్కల వివరాలను గత ఏడాది అక్టోబర్ 2న విడుదల చేసింది.ఈ సర్వే ప్రకారం రాష్ట్ర మొత్తం జనాభాలో ఓబిసిలు అత్యధికంగా 63 శాతం ఉండగాఎస్‌సి, ఎస్‌టిలను మొత్తంగా లెక్కగడితే 21 శాతానికి మించి ఉన్నారు. కాగా..కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా బలహీన వర్గాలకు(ఇడబ్లుస్) 10 శాతం కోటాను ప్రవేశపెట్టి రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఇదివరకే అతిక్రమించిందని బీహార్ ప్రభుత్వం అభిప్రాయం వ్యక్తం చేసింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఓబిసిలు, ఇబిసిల రిజర్వేషన్ కోటాను 50 శాతం నుంచి 65 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తన రిజర్వేషన్ చట్టాలను సవరించింది. ఇడబ్లుఎస్ కోటా 10 శాతాన్ని కూడా కలుపుకుంటే రాష్ట్రంలోని మొత్తం జనాభాలో 75 శాతం మందికి రిజర్వేషన్ కోటా వర్తిస్తోంది. తాము సవరించిన రిజర్వేషన్ చట్టాలను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పొందుపరచాలని కూడా కేంద్రాన్ని బీహార్ ప్రభుత్వం కోరింది. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో ఉండే కేంద్ర, రాష్ట్ర చట్టాలను కోర్టులలో సవాలు చేసేందుకు అవకాశం ఉండదు. రిజర్వేషన్ కోటాపై 50 శాతం గరిష్ఠ పరిమితి విధిస్తూ సుప్రీంకోర్టు 1992లో ఉత్తర్వులు జారీచేసింది. జెడియుతో అధికారాన్ని పంచుకున్న సమయంలో వచ్చిన ఈ కోటా చట్టాల సవరణను స్ఫూర్తిగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ తాము కేంద్రంలో అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగణన నిర్వహిస్తామని తన లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేసింది.

# కాంగ్రెస్ లో ఉండేదీ ఎవరు..?

✍ జయభేరి, వరంగల్ జూన్ 21:

శాసన మండలిలో తమ సభ్యులను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ అలర్ట్ అయింది. శాసనమండలిలో మొత్తం 40మంది సభ్యులుండగా వీరిలో 29మంది బీఆర్ఎస్ పార్టీవారే. కాంగ్రెస్‌కు కేవలం నలుగురు ఎమ్మెల్సీలే ఉన్నారు. ఇప్పుడు హస్తం పార్టీ ఆపరేషన్ ఆకర్ష్ స్టార్ట్ కావడంతో గులాబీపార్టీలో గుబులు మొదలైంది. త్వరలో శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఉన్నందున ఎలాగైనా గులాబీదళం బలం తగ్గించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ గట్టి కసరత్తు చేస్తోంది.శాసన మండలిలో పలు కీలక బిల్లుల ఆమోదానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు అడ్డుపడే అవకాశం ఉన్నందున కాంగ్రెస్ వారికి గాలం వేస్తోంది. ఇప్పటికే కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో టచ్‌లో ఉన్నట్టు సమాచారం. వీరు పార్టీని వీడి కాంగ్రెస్‌తో జతకట్టేందుకు సిద్ధమయ్యారనే టాక్ వినిపిస్తోంది. దీంతో బీఆర్ఎస్ అధిష్ఠానం అలర్ట్ అయింది. ఎవరెవరు పార్టీమారే అవకాశం ఉందో ఆరా తీస్తోంది. ఎమ్మెల్సీలకు సన్నిహితంగా ఉండేవారి నుంచి వివరాలు సేకరిస్తుంది.బీఅర్ఎస్ ఎమ్మెల్సీలు తమపార్టీతో చేరితే పదవులు,నిధులు ఇస్తామని కాంగ్రెస్ హామీలు ఇస్తున్నట్టు సమాచారం. బీఆర్ఎస్ రాజకీయ భవిష్యత్తు ఇచ్చినప్పటికీ మరో కొంతకాలం పదవి ఉండాలంటే పార్టీ మారడం శ్రేయస్కరమని కొందరు ఎమ్మెల్సీలు భావిస్తున్నట్టు టాక్. అందులో భాగంగానే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు పలువురు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. కొందరికి పార్టీ అధినేత కేసీఆర్ ఫోన్ చేస్తే వారినుంచి సరైన సమాధానం రాలేదని.. అలాగని పార్టీలో కొనసాగుతామని కూడా చెప్పలేదు. దీంతో 29మంది బీఆర్ఎస్ ఎమ్మెల్సీలలో కనీసం 10మందైనా మిగులుతారా అనే సందేహం కారుపార్టీని తారెత్తిస్తోంది. వరంగల్ జిల్లా నుంచి ఎమ్మెల్సీలుగా ఉన్న ఆరుగురు





బీఆర్ఎస్ నేతలు కేసీఆర్‌కు అత్యంత సన్నిహితులుగా పేరుగాంచారు.అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తమ భవిష్యత్తుకోసం పార్టీ మారేందుకు వీరు సిద్ధమవుతున్నట్టు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్ తీరును, టికెట్ల కేటాయింపును వరంగల్ జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్సీ బహిరంగంగానే తప్పుబట్టారు. ఆయన నియోజకవర్గం ప్రస్తుతం కాంగ్రెస్ కంచుకోటగా మారడంతో పార్టీమారాలని అనుచరగణం ఒత్తిడి చేస్తోంది. మరో ఎమ్మెల్సీపై కూడా అనుచరులు పార్టీ మారాలని ఇలాగే ఒత్తిడి చేస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్‌లోకి వస్తే రాజకీయ భవిష్యత్తు ఉంటుందని రేవంత్‌కు సన్నిహితుడైన ఎమ్మెల్యే ఒకరు ఆ ఎమ్మెల్సీకి చెప్పినట్టు తెలిసింది. ఈ జిల్లాకు చెందిన మరో ఎమ్మెల్సీకి కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు మంత్రులతో అత్యంత సన్నిహిత సంబంధాలు ఉండడంతో ఆయన కూడా కాంగ్రెస్‌లోకి జంప్ చేసే అవకాశాలున్నట్టు ప్రచారం జరుగుతోంది.

### విస్తరణలో ఐదుగురికి చోటు

స్థానిక సంస్థల ఎన్నికల వేళ కేబినెట్ విస్తరణ దృష్టి సారించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఈ వ్యవహారంపై ఇప్పటికే కాంగ్రెస్ హైకమాండ్‌తో మంతనాలు జరిపారు. దాదాపు గ్రీన్ సిగ్నల్ వచ్చినట్టు అంతర్గత సమాచారం. తెలంగాణలోని ముఖ్యనేతలు ఇప్పటికే కాంగ్రెస్ పెద్దలతో తమకున్న సంబంధాల ద్వారా లాబీయింగ్ మొదలుపెట్టారు. అంతా అనుకున్నట్లు జరిగితే జులై మొదటివారంలో కేబినెట్ విస్తరణ ఉండవచ్చని అంటున్నారు.ప్రస్తుతం ముఖ్యమంత్రితోపాటు 12 మంది మంత్రివర్గంలో ఉన్నారు.
మరో ఐదారుగురు ఛాన్స్ ఉన్నా, ఈసారి ఐదుగురుకి చోటు కల్పించాలని భావిస్తున్నారట. రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో కొన్ని జిల్లాలకు ఎక్కువ ప్రాతినిధ్యం దక్కగా, కొన్ని జిల్లాలకు అసలు చోటు లేదు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు సంబంధించిన నేతలెవ్వరూ లేరు.ఈసారి ఆయా జిల్లాలకు ఛాన్స్ ఇవ్వాలన్నది అసలు పాయింట్. ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి చాలామంది జాయిన్ అయ్యారు.. మరికొందరు రేపోమాపో కాంగ్రెస్‌లోకి రావాలని భావిస్తున్నారు. తమకు మంత్రివర్గం లో చోటు లేకపోయినా, మిగతా పదవులు ఇవ్వాలని కోరుతున్నట్లు పొలిటికల్ సర్కిల్స్ సమాచారం.లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ముదిరాజ్‌లకు ప్రాతినిధ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు కాంగ్రెస్ పెద్దలు. వారిలో ముక్తల్ నుంచి శ్రీహరికి రావచ్చని అంటున్నారు. రాజగోపాల్ రెడ్డి, గడ్డం వివేక్, ప్రేమసాగర్, సుదర్శన్‌రెడ్డి, మైనార్టీల నుంచి ఒకరు పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒక స్థానాన్ని ఖాళీగా ఉంచి, స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత దాన్ని భర్తీ చేయాలని భావిస్తున్నారట సీఎం రేవంత్‌రెడ్డి. కేబినెట్ విస్తరణ తర్వాత నాలుగైదు నెలల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నట్లు సమాచారం.

# డైలామాలో కేటీఆర్ ఫ్యూచర్

✍ జయభేరి, హైదారాబాద్, జూన్ 21:

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫ్యూచర్ డైలమాలో పడింది. అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికల్లో అన్నీ తానై వ్యవహరించిన గులాబీపార్టీ చిన్నబాస్ లోక్‌సభ ఫలితాల తర్వాత పత్తా లేకుండా పోయారు. అసలే సీఎం సీటు దిగాల్సి వచ్చిందన్న బెంగతో కేసీఆర్ ఫాంహౌస్ నుంచి బయటకు రావడం లేదు. ఇటు చూస్తే ఒక్క ఎంపీ స్థానం కూడా దక్కకపోవడంతో కేటీఆర్ పార్టీ శ్రేణులకు నల్లపూస అయిపోయారు. తీహార్ జైలుకు వెళ్లి చెల్లిన చూసొచ్చిన వెంటనే ఆయనకు ఎన్నికల అఫిడవిట్ ఉచ్చు బిగుసుకుంది. ఆ క్రమంలో ఆయన పోస్టుపై పార్టీలో పెద్ద చర్చే జరుగుతుంది.వరుస ఓటములతో బీఆర్ఎస్ ఉక్కిరి బిక్కిరి అవుతుంది. మరోవైపు వలసలు గులాబీ పెద్దలకు షాక్‌ల షాక్‌లు ఇస్తున్నాయి. దాంతో పార్టీ మనుగడే ప్రశ్నార్థకంగా తయారైంది. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిపై సమీక్షలు నిర్వహించి.. పార్టీ శ్రేణుల్లో స్థైర్యం నింపాల్సిన భాధ్యత కేటీఆర్‌దే. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కేటీఆరే ఎక్కువ హడావుడి చేశారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడైతే కేసీఆర్ ఢిల్లీ పాలిటిక్స్ చూసుకుంటారు. తానే సీఎం అన్న రేంజ్లో బిల్డప్ ఇచ్చారు. తన వర్గం ఎమ్మెల్యేలతో సీఎం, సీఎం అని నినాదాలు కూడా చేయించుకున్నారు.అయితే ఆ కల్వకుంట్ల దొరలు కన్న కలలు ఒక్కటి కూడా నెరవేరలేదు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో వరుస పరాభవాలతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కీలక నేతలు పార్టీకి గుడ్‌బై చెపుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన బైపోల్స్‌లో కూడా కారు టైర్లు పేలిపోయాయి. ఆ దెబ్బతో ఇప్పటికే కొంతమంది బీఆర్ఎస్ నాయకులు పలువురు కాంగ్రెస్‌లోకి వెళ్లిపోయారు. మరికొందరు కాంగ్రెస్ లేదా బీజేపీలోకి వెళ్లాలని చూస్తున్నారు.



ఇలాంటి కష్టకాలంలో యాక్టివ్‌గా ఉంటూ పార్టీ నాయకులను మరోపార్టీకి వెళ్లిపోకుండా ఆపాల్సిన కేటీఆర్ సైలెంట్ గా ఉండటం ఏమిటన్న విమర్శలు వస్తున్నాయి. అసలు ఆయన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా క్యాపబులేనా? అన్న అనుమానాలు పార్టీ వర్గాల్లోనే వ్యక్తమవుతున్నాయి. ఆయన్ని ఆ పోస్టు నుంచి దించాలని డిమాండ్లు కూడా మొదలయ్యాయి.లోక్‌సభ ఎన్నికల్లో సత్తాచాటుతామని బీరాలు పలికిన ఆయన.. ఇప్పుడు అవమాన భారంతో బయటకు రావడం లేదని ప్రత్యర్థి పార్టీలు విమర్శిస్తున్నాయి. మరోవైపు ఎన్నికల అఫిడవిట్‌పై కోర్టు విచారణ , ఫోన్ ట్యాపింగ్ కేసు, గొర్రెల స్కామ్, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు, ఇలా బీఆర్ఎస్‌లోని పెద్ద తలకాయల చుట్టూ గట్టిగానే ఉచ్చు బిగుస్తోంది. ఈ పరిస్థితుల్లో కేటీఆర్‌కు పార్టీని హ్యాండిల్ చేసే సినిమా లేదని.. వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు తీసి మళ్లీ ఫారిన్ పంపించేస్తే బెటర్ అన్న సూచనలు కూడా వస్తున్నాయంట. ఎంత కాదన్న రెండు టర్మ్‌లు సీఎంగా పనిచేసిన కేసీఆర్ పార్టీని వదులుకోలేరు. కొడుకు కేటీఆర్ యాక్టివ్ రోల్ పోషించిన లోక్‌సభ ఎన్నికల్లో సొంత జిల్లా మెదక్ లోనూ బీఆర్ఎస్ కు కలిసి రాలేదు. ఇక రేపోమాపో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయి. ఇటు చూస్తే పార్టీ కేడర్ పూర్తిగా నిరుత్సాహంలో ఉంది. దాంతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి మార్పు పైన కేసీఆర్ ఆలోచన చేస్తున్నారంట.ట్రాక్ తప్పిన పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి ఎలాగొలా గాడిలో పెట్టడానికి కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను పార్టీలో కీలక బాధ్యతల నుంచి తప్పించాలని భావిస్తున్నారంట. కేటీఆర్ స్థానంలో కుటుంబంలోనే మరొకరికి కేటాయించాలా లేదా బయట వ్యక్తులకు ఆ పదవి కట్టబెట్టాలా అనేదానిపై కేసీఆర్ సమాలోచనలు కొనసాగిస్తున్నారంటున్నారు.ఆ క్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు రేసులో హరీశ్‌రావు పేరు ఫోకస్ అవుతుంది. హరీష్ కు అప్పగించినా కుటుంబ సభ్యులకే మరోసారి పదవి ఇచ్చారనే విమర్శలు ఎదురయ్యే ఛాన్స్ ఉంది. దీంతో హరీష్ తో పాటుగా ఎస్సీ, బీసీ సామాజికవర్గాల నుంచి ఎవరినైనా రెండో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేయాలని చూస్తున్నారంట. తెలంగాణ వచ్చినప్పుడు దళితుడ్ని ముఖ్యమంత్రి చేస్తానని ఎన్నికల ప్రచారంలో ఘనంగా ప్రకటించారాయన. గెలవగానే ఆ విషయం మర్చిపోయారు. ఇప్పుడు రెండో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవైనా ఆ వర్గానికి కేటాయించాలని లీడర్ని వెతుక్కుంటున్నారంట. మొత్తానికి అలా సాగిపోతోంది కారు పార్టీ ప్రయాణం.

### కేటీఆర్ నోటీసులు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ కు రాష్ట్ర హైకోర్టు నోటీసులు జారీ చేసింది. నామినేషన్ సందర్భంగా కేటీఆర్ సమర్పించినటువంటి ఎన్నికల అఫిడవిట్లలో తప్పుడు ప్రచారం ఉందంటూ కాంగ్రెస్ నేత కేకే మహేందర్ రెడ్డి, లగిశెట్టి శ్రీనివాసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు.. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేటీఆర్ తోపాటు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, సిరిసిల్ల రిటర్నింగ్ ఆఫీసర్ కు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను హైకోర్టు వాయిదా వేసింది.

# సీబీఐ విచారణ కోరే దమ్ముందా?

✍ జయభేరి, కరీంనగర్ :

సింగరేణిలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా? అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీబీఐ విచారణ జరిపితే గత ప్రభుత్వ నిర్వాకాలతోపాటు సింగరేణి దుస్థితికి కారకులెవరో తేలిపోతుందన్నారు. సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని సాక్షాత్తు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రకటించిన తరువాత కూడా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మళ్లీ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజల్లో అయోమయం సృష్టిస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం లేకుండా కేంద్ర ప్రభుత్వం సింగరేణిని ప్రైవేటీకరణ చేయడం అసాధ్యమని స్పష్టం చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు కరీంనగర్ లోని ఇంగ్లీష్ యూనియన్ స్కూల్ మున్సిపల్ గ్రౌండ్ లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. అందులోని ముఖ్యాంశాలు...



అందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు. ప్రధాని నరేంద్రమోదీ కృషి వల్లే ఈరోజు అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకుంటున్నం. 2014లో ఐక్య రాజ్యసమితిలో మోదీ మాట్లాడుతూ యోగా దినోత్సవాన్ని అంతర్జాతీయ దినోత్సవంగా ప్రకటించాలని ప్రతిపాదించడంవల్లే గత పదేళ్లుగా జూన్21 రోజు అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్నాం. అన్ని రోగాలకు పరిష్కారం యోగా. చిన్నా పెద్ద తేడా లేకుండా క్రమం తప్పకుండా యోగా చేయాలి. 'మన శ్రేయస్సుతోపాటు సమాజ శ్రేయస్సు' అనే నినాదంతో ఈసారి యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.సింగరేణిపై తప్పుడు ప్రచారం.ప్రజలను అయోమయం చేసే కుట్ర. మోదీ రామగుండం వచ్చి సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. సింగరేణిలో కేంద్రానిది 49 శాతం వాటా మాత్రమే. రాష్ట్రానిది 51 శాతం ఉంది. అట్లాంటప్పుడు రాష్ట్ర అనుమతి లేకుండా సింగరేణి ప్రైవేటీకరించడం ఎట్లా సాధ్యం?
సింగరేణి ఈ దుస్థితికి రావడానికి ప్రధాన కారణం నాటి సీఎం బీఆర్ఎస్ ప్రభుత్వానిదే. తాడిచర్లలో ఏపీజెన్‌కోకు ఇస్తే...కేసీఆర్ ప్రభుత్వం ప్రైవేట్ వాళ్లకు అప్పగించింది నిజం కాదా? సింగరేణిని పూర్తిగా ప్రైవేటీకరించిందే కేసీఆర్. ఆయన మూర్ఖత్వపు ఆలోచనవల్ల సింగరేణిని పూర్తిగా దెబ్బతీశారు. తన కుటుంబానికి ఏటీఎంగా మార్చుకున్నారు. కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉంటే... సింగరేణి కార్మికుల పట్ల ప్రేమ ఉంటే గతంలో కేసీఆర్ చేసిన అవినీతి, అక్రమాలపై సీబీఐ విచారణ కోరే దమ్ము మీకుందా? నిన్న ఓ టీవీ ఛానల్ చర్చలో బీజేపీ ఎస్సీ మోర్చా నేత ఎస్.కుమార్ సింగరేణి అక్రమాలపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా? అని ప్రశ్నిస్తే... కాంగ్రెస్ నేత మాట్లాడుతూ తప్పనిసరిగా సింగరేణిపై సీబీఐ విచారణ జరపాలని కేంద్రానికి లేఖ రాస్తామని చెప్పారు. ఆ మాటకు కట్టుబడి లేఖ రాసే దమ్ముందా? కేసీఆర్ కుటుంబం స్వలాభం కోసం సింగరేణిలో పొట్టుపొట్టు అవినీతి చేస్తే... కాంగ్రెస్ కూడా అదే బాటలో నడుస్తోంది. కేసీఆర్ సర్కార్ గతంలో నయీం కేసు, మియాపూర్ భూములు, డ్రగ్స్, పేపర్ లీకేజీ వంటి వాటిపై సిట్ వేసి మధ్యలోనే నీరుగార్చారు. కాంగ్రెస్ కూడా అంతే. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం విచారణ పేరుతో జాప్యం చేస్తూ లాభం పొందాలనుకుంటున్నారే తప్ప వేరే ఆలోచనలే లేదు.. మళ్లీ చెబుతున్నా. సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదు. అసలు రాష్ట్రప్రభుత్వ ఆమోదం లేకుండా సింగరేణిని ప్రైవేటీకరించడం కేంద్రానికి సాధ్యమే కాదు...

# ప్రపంచ యోగ దినోత్సవ శుభాకాంక్షలు

▸ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**



ప్రపంచ యోగ డే సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అందరికీ యోగ డే శుభాకాంక్షలు తెలిపారు. యోగ డే సందర్భంగా మల్లాపూర్, చిలుక నగర్ లో ఏర్పాటు చేసిన యోగ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. యోగ అనేది మన ఆధ్యాత్మిక, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఒక అద్భుతమైన సాధనం. నిత్యం యోగ సాధన ద్వారా మన జీవనశైలిని మార్చుకోవాలి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, మీర్ పేట HB Colony డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ చిలుకనగర్ BRS పార్టీ నాయకులు గుడి మధుసూదన్ రెడ్డి, సర్మెట్ స్కూల్ యాజమాన్యం విజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అమ్మవార్ల ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే బండారి

**జయభేరి, ఉప్పల్ :**

అమ్మవార్ల వార్షికోత్సవ ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి. రామంతపూర్ డివిజన్, ఆర్టీసీ కాలనీలో శ్రీశ్రీశ్రీ బంగారు మైసమ్మ అమ్మవారి గుడి ప్రతిష్టాపన 17వ వార్షికోత్సవం, శ్రీరామ కాలనీలో శ్రీశ్రీశ్రీ మహంకాళి అమ్మవారి ప్రథమ వార్షికోత్సవ ప్రత్యేక పూజలలో గౌరవ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి పాల్గోన్నారు. ఈ కార్యాక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రనాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి, గంథం నాగేశ్వరావు, మేరు సతీష్, పాలకూరి శ్రీకాంత్ గౌడ్, మోహన్ బాబు, మల్లికార్జున్, వెంకట రమణ, సురం శంకర్, చాంద్ పాషా, బోసాని పవన్, ఆలే రమేష్, మనీష్, రవి, మంజుల, అనంద్, చేగురి శ్రీను, టోనీ, శ్రీరామ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కేశవ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇటికల విష్ణు మూర్తి, కోశాధికారి చంద్రాయ యాదవ్, మందపాటి శ్రీనివాస్ రెడ్డి, రాంచంద్ర చారి, విజయలక్ష్మి, ప్రశాంత్, అంజనేయులు, సందీప్ రెడ్డి తదితరులు పాల్గోన్నారు.



## ఉన్నత స్థాయికి ఎదిగిన సేయింట్ మేరీస్ స్కూల్ విద్యార్థి

**జయభేరి, దేవరకొండ :**

ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుండే లక్ష్యాన్ని ఎంచుకొని, కష్టపడి చదువుతేనే ఉన్నత శిఖరాలకు చేరుతారని సేయింట్ మేరీస్ పాఠశాల ప్రిన్సిపల్ బల్ల నక్షత్రం తెలిపారు. కృషి ఉంటేనే మనుషులు ఋషులవుతారు మహా పురుషులవుతారు అన్న సామెతకు లెఫ్టినెంట్ కొర్ర అరవింద్ చౌహన్ నిరూపించారు. అక్షరాభ్యాసం నుండి 5వ తరగతి వరకు సేయింట్ మేరీస్ పాఠశాలలో చదివిన తన విద్యార్థి కొర్ర అరవింద్ చౌహన్ నేడు ఇండియన్ ఏవియేషన్ మిలిటరీ పైలెట్ లెఫ్టినెంట్గా పదోన్నతి పొందడం చాలా సంతోషం కలిగించిందని అన్నారు. తన పాఠశాలలో చదివిన విద్యార్థి మారుమూల గిరిజన తండా నుండి రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు పొందడం, ఆల్ ఇండియా ఎయిర్ ఫోర్స్ చీఫ్ ఆఫీసర్ చేత పైలట్గా నియామక పత్రం స్వీకరించడం గర్వంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల అధ్యాపక బృందం లెఫ్టెంట్ అరవింద్ చౌహాన్ కి పూలమాలతో, శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బల్ల నక్షత్రం మాట్లాడుతూ.. పట్టుదల, క్రమశిక్షణ,అంకితభావంతో చదివితే విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని, ప్రతి విద్యార్థికి పట్టుదల,ఆలోచన, క్రమశిక్షణ ఉండాలని అన్నారు. గొప్ప వ్యక్తులను చూసి ఈర్ష పడకుండా వారు ఎలా ఎదిగారో చూసి నేర్చుకోవాలని అన్నారు. గతంలో పూర్వీకులకు చదువుకునేందుకు సౌకర్యాలు లేవని, ఇప్పుడు అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని వాటిని విద్యార్థులు సమర్థవంతంగా వినియోగించుకొని చదువుకోవాలని కోరారు. ఉన్నతంగా చదువుకుంటేనే సమాజంలో విలువ గౌరవం ఉంటుందని, ఇరవై ఏళ్లు కష్టపడితే మరో ఎనభై ఏళ్లు బాగుపడతారని, సమాజంలో ఉన్నందుకు ఉన్నతమైన చదువు చదివి ఉపాధ్యాయులకు, తల్లి దండ్రులకు దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చేవారవుతారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ,పట్టుదల, కృషితో విద్యాబుద్ధులు నేర్చుకుంటే ముందడుగు వేసేందుకు వీలవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరికి జీవితంలో గెలుపోటములు సహజమేనని, ఓటమి



తోనే విజయాన్ని సాధించేందుకు వీలవుతుందన్నారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ అరవింద్ చౌహన్ విద్యార్థులతో హితభోదంలో మాట్లాడుతూ.. తనకు విద్యాబుద్ధులు నేర్పి, తనను ఇంతటి గొప్ప స్థాయికి ప్రోత్సహించిన పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ప్రస్తుతం పోటీ ప్రపంచంలో నడుస్తున్నారని, ఒకరికి మించి ఒకరికి తెలివితేటల్లో దూసుకుపోతున్నారన్నారు. సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం పెంచుకోవాలని, దేవరకొండ పట్టణంలోనే 30 సంవత్సరాలు చరిత్ర కలిగిన మొట్టమొదటి ఏకైక ఇంగ్లీష్ మీడియం సేయింట్ మేరీస్ పాఠశాల ప్రిన్సిపల్ చాలా అనుభవజ్ఞురాలు అని , తన ఆధ్వర్యంలో ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగారని, మరెన్నో విద్యార్థులు దేశ విదేశాలలో డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, వివిధ ఉన్నత హోదాలలో రాణిస్తున్నారని గుర్తు చేసారు. భవిష్యత్తులో కూడా పాఠశాల విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. సమాజంలో ఉన్నందుకు ఉన్నతమైన చదువు చదివి ఉపాధ్యాయులకు, తల్లితండ్రులకు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలని విద్యార్థులను కోరారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం వైస్ ప్రిన్సిపల్ రేఖ, నవీన్, చందర్, జబ్బార్, కొండల్, లింగేశం, రజాక్, రంజాన్ బేగ్, కరుణ, స్వాతి, సునంద, రాజేశ్వరి, రమణ, నుస్రత్, సమీనా, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## యోగాతో ఆరోగ్య దేశ నిర్మాణానికి బాటలు వేయాలి

▸ యోగా దినోత్సవంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

**జయభేరి, మేడ్చల్ :**




సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ కోసం మన ఋషులు పూర్వికులు అందించిన యోగాను ప్రతి ఒక్కరు ఆచరించి ఆరోగ్య దేశ నిర్మాణానికి బాటలు వేయాలని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ అన్నారు. పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో మేడ్చల్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీ ఈ సందర్భంగా మాట్లాడుతూ మనిషికి ఎన్ని ఆస్తులు అంతస్తులు, పదవులు ఉన్న ప్రశాంతత కరువైందని అన్నారు. నేటి ఉరుకు పరుగుల సమాజంలో మనిషి తీవ్ర ఒత్తిడిలోనై రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. శారీరిక శ్రమ కరువై చిన్న పెద్ద, పేద గొప్ప అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరికి ఆరోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయి అన్నారు. ఒత్తిడి తగ్గించుకుంటే ఏదైనా సాధించవచ్చు, ముఖ్యంగా ఆరోగ్యాన్ని కాపాడుకో వచ్చని అందుకు యోగ సాధన ఎంతో ఆవశ్యకత అని అన్నారు. ఆర్థిక అభివృద్ధి తో పాటు ఆరోగ్య దేశంగా భారత్ ఆదర్శవంతంగా తయారు కావాల్సిన అవసరం ఉందన్నారు. మరోసారి ప్రపంచానికి విశ్వ గురువు గా భారత దేశాన్ని నిలిపేందుకు మనకు పరంపరగా వస్తున్న యోగాను ఆచరించి ఆరోగ్యవంతులుగా జీవించాలని కోరారు. ఆరోగ్య దేశాన్ని తయారు చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ యోగాను అందరికీ అందించాలని సంకల్పంతో 10 సంవత్సరాల క్రితం అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రారంభించడం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, మేడ్చల్ మాజీ జెడ్పిటిసి శైలజా హరినాథ్, జిల్లా రైతు సమితి మాజీ అధ్యక్షుడు నందా రెడ్డి, డబిల్ పూర్ మాజీ సర్పంచ్ రాజ మల్లారెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు ఆంజనేయులు, పతాంజలి సమితి జిల్లా అధ్యక్షుడు కిషోర్, మేడ్చల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు హరినాథ్, కోశాధికారి మల్లారెడ్డి, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, పతాంజలి సభ్యులు కవిరాజ్, మురళి, శ్రీనివాస్, తారక్, ప్రవీణ, పుష్పలత నాయకులు ప్రభాకర్ రెడ్డి, కిషన్ రావు, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో వాలాల ఆందోళన



▸ ఆటో స్టాండ్ స్థలం కేటాయించాలని డ్రైవర్ల ధర్నా..
▸ మద్దతు తెలిపిన బిజెపి నాయకులు
▸ స్పందించిన మున్సిపల్ చైర్ పర్సన్..
▸ ఆటో స్టాండ్ ఏర్పాటుకు సహకరిస్తామని హామీ..

**జయభేరి, మేడ్చల్ :**

దేవుడు వరం ఇచ్చిన పూజారి కరుణించలేదు అనే విదంగా గుండ్లపోచంపల్లి మున్సిపల్ అధికారులు తీరు ఉందని ఆటో డ్రైవర్లు ఆరోపించారు. ఆటో పార్కింగ్ ఏర్పాటు చేసుకోమని స్థలం కేటాయించిన మున్సిపల్ అధికారులే తాము వేసుకున్న గుడిసెను కూల్చివేసి పొట్ట కొట్టేలా ప్రవర్తిచడం ఏంటని ప్రశ్నించారు. గుండ్లపోచంపల్లిలో గత 30 సంవత్సరాల నుండి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న తమకు సరైన పార్కింగ్ స్థలం లేదని ఈ విషయంలో మున్సిపల్ కమిషనర్ ను వినతిపత్రం ద్వారా కోరగా నారాయణ చెరువు కట్టపై ఉన్న ఖాళీ స్థలంలో ఆటో స్టాండ్ ఏర్పాటు చేసుకోమని చెప్పారని కానీ మున్సిపల్ సిబ్బంది ఈరోజు ఉదయం ఆటో యూనియన్ ఏర్పాటు చేసిన గుడిసెను తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా ఆటో డ్రైవర్లు ధర్నా చేపట్టారు. వారికి మేడ్చల్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, కౌన్సిలర్ అమరం హేమంత్ రెడ్డిలు మద్దతు తెలుపుతూ ధర్నాలో పాల్గొన్నారు.



### చైర్ పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి హామీ

ఆటో స్టాండ్ స్థలం కావాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆటో డ్రైవర్లు చేపట్టిన ధర్నా సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి ఆటో డ్రైవర్లతో మాట్లాడారు. నిత్యం ప్రజా రవాణ విషయంలో ప్రజలకు అందుబాటులో ఉంటున్న ఆటో డ్రైవర్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆటో స్టాండ్ స్థలం విషయంలో ఇకమీదట ఎటువంటి ఇబ్బందుకు రాకుండా అధికారులతో మాట్లాడి స్థలాన్ని కేటాయిస్తామని మద్దుల లక్ష్మీ పేర్కొన్నారు.

## నిందితులను అదుపులోకి తీసుకోవాలి

▸ నగల వ్యాపారిని పరామర్శించిన ఎంపీ ఈటల, రాజాసింగ్



**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ పట్టణంలో గురువారం జగదాంబ జ్యూవెలరీ దుకాణంలో జరిగిన దొంగతనం గురించి తెలుసుకున్న బీజేపీ నేతలు దుండగుల చేతిలో గాయపడిన వ్యాపారిని పరామర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యాపారి శేశారాం చౌదరిని శుక్రవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ దుకాణాన్ని పరిశీలించారు. అనంతరం బాధిత షాపు యజమాని శేషారాంను పరామర్శించి, భరోసా కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే రాజసింగ్ మాట్లాడుతూ నిందితులను సత్వరమే అదుపులోకి తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు. ఇలాంటి నేరాలను అరికట్టడంలో పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో కూడా మేడ్చల్ ప్రాంతలో ఇలాంటి సంఘటనలు జరిగాయని గుర్తు చేశారు. ఇలాంటి దొంగతనాల వల్ల వ్యాపారులు భయబ్రాంతులకు గురవుతున్నారని, పోలీసులపై పూర్తి విశ్వాసం ఉందని దొంగలను త్వరలోనే పట్టుకుంటారని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు. మేడ్చల్ పట్టణంలో వ్యాపారం చేస్తున్న వ్యాపారులకు మేము అండగా ఉంటామని ఎవరు బయపడొద్దని రాజసింగ్ వ్యాపారులకు ధైర్యం చెప్పారు.



## దుండగులను తొందర్లోనే పట్టుకుంటాం

▸ మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి



**జయభేరి, మేడ్చల్ :**

దొంగతనానికి పాల్పడ్డ దుండగులను తొందర్లోనే పట్టుకుంటామని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం మేడ్చల్ డీసీపీగా కోటిరెడ్డి పదవి బాధ్యతలు చేపట్టారు. అనంతరం మేడ్చల్ పట్టణంలో శ్రీ జగదాంబ జువెలరీస్లో నగల వ్యాపారిపై దుండగులు కత్తితో దాడి చేసి నగల చోరీకి ప్రయత్నించిన సంఘటన స్థలాన్ని మేడ్చల్ ఏసిపి శ్రీనివాస్ రెడ్డి, సీఐ సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దుండగులను పట్టుకోవడానికి ప్రత్యేకమైన బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దుండగులకు సంబంధించిన పలు కీలక ఆధారాలు కూడా సేకరించినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు అమర్చుకోవాలని వాటి ద్వారా నేరస్తులను పట్టుకోవడం ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. రాబరీ కేసు కింద కేసు నమోదు చేసినట్లు డీసీపీ చెప్పారు.






## తమిళనాడు కల్తీ మద్యం ఘటనపై స్పందించిన నటుడు

తమిళనాడు రాష్ట్రంలోని కళ్లకురిచి జిల్లాలో కల్తీ మద్యం కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. కల్తీ మద్యం తాగి ఇప్పటివరకు 47 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 100 మంది ఆసుపత్రిపాలయ్యారు. ఇక అస్వస్థతకు గురైన వారు కళ్లకురిచి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో చికిత్స తీసుకుంటున్నారు. అయితే ఈ ఘటనకు ప్రభుత్వ అధికారుల వైఫల్యంతో పాటు, పోలీసుల నిర్లక్ష్యమే కారణమని వివిధ రాజకీయ పార్టీల నేతలు, సామాజిక కార్య కర్తలు, నటీనటులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఈ ఘటనపై సినీ నటులు కమల్ హాసన్, విశాల్‌తో పాటు తమిళ దర్శకుడు పా. రంజిత్ ఎక్స్ వేదికగా స్పందించారు. కమల్ స్పందిస్తూ.. కల్తీ మద్యం వార్త తమిళనాడును ది గ్భ్రాంతికి గురిచేసింది. కల్తీ మద్యం వ్యాపారులపై తమిళనాడు ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలి, తద్వారా తమిళనాడులో ఇలాంటి దుర్ఘటన మళ్లీ జరగకుండా చూడాలి అంటూ ఎక్స్ వేదికగా రాసుకోచ్చాడు. ప్రభుత్వం సత్వరమే స్పందించి భాదితులకు అండగా ఉండాలి. గతేడాది విల్లుపురం జిల్లాలో కల్తీ మద్యం తాగి 22 మంది చనిపోయారు. అప్పుడు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. కానీ ఆ ఘటన జరిగిన పక్క జిల్లాలోనే ఇప్పుడు 50కి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి కల్తీ మద్యం వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలి అంటూ రాసుకోచ్చాడు.

## మనసు విరిగిపోతుంది

తెలుగు నటి చాందిని చౌదరి ఇండస్ట్రీలో ప్రస్తుతం ఫుల్ ఫామ్‌లో దూసుకుపోతుంది. కలర్ ఫొటోతో గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ ఈ ఏడాది ఇప్ప టికే మూడు సినిమాలలో నటించింది. ఇప్పటికే చాందిని నటించిన గామి సినిమా విడుదలై మంచి విజయం అందుకోగా రీసెంట్‌గా వచ్చిన యేవమ్, మ్యూజిక్ షాప్ మూర్తి సినిమాలు బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లు సాధిస్తున్నాయి. ఇదిలావుంటే తాజాగా ఈ భామ ఇండస్ట్రీలో ఉన్న మగవాళ్లపై సంచలన పోస్ట్ పెట్టింది. నిజాయితీగా నా దగ్గర నుంచి ఒక ప్రశ్న, నేను చూసిన దాన్ని బట్టి అడుగు తున్నాను, చిత్ర పరిశ్రమలో పని చేసే ఆడవాళ్ళని మగవాళ్ళు ఎందుకు క్యారెక్టర్ లేని వాళ్ళ లాగా చూస్తారు. వాళ్ళు మాట్లాడే ప్రతి మాటలో కూడా ఆడవాళ్ళని తక్కువ చేసి మాట్లాడతారు. ఇది చాలా బాధ కలిగిస్తుంది ఎందుకంటే ఈ ఫీల్డ్‌లో చాలా కష్టపడి పని చేయాల్సి ఉంటుంది. ఇలాంటివి చూసి నప్పుడు మనసు విరిగిపోతుందంటూ చాందిని ఎక్స్ వేదికగా రాసుకోచ్చింది. కాగా ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.




## నా కెరీర్‌లో చెత్త సెలక్షన్ అంటే ఆ సినిమానే..

నయనతార కెరీర్‌ని మలుపుతిప్పిన సంవ త్సరం 2005. ఎందుకంటే ఆ ఏడాది రెండు బ్లాక్‌బాస్టర్‌లు ఆమెకు దక్కాయి. అందులో మొదటిది 'చంద్రముఖి' కాగా.. రెండోది 'గజనీ'. ఈ రెండు సినిమాల్లో నయనతార సెకండ్ హీరోయినే కావడం గమనార్హం. అయితే.. ఆమెకు గుర్తింపు తెచ్చింది మాత్రం ఈ రెండు సినిమాలే. ఆడియన్స్ అభిప్రాయం కూడా ఇదే.. కానీ నయన్ అభిప్రాయం మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో నయన్ మాట్లాడుతూ 'నా కెరీర్‌లో చెత్త సెలక్షన్ అంటే 'గజనీ' సినిమానే చెబుతా. ఇప్పటికీ ఆ సినిమా ఎందుకు చేశానా అని బాధప డుతుంటా. చెప్పింది వేరు.. తీసింది వేరు. అప్పట్లో ఆ విషయాన్ని పెద్దగా పట్టించుకో లేదు. అయితే.. అదొక పాఠంగా తీసుకొని తర్వాత నుంచి జాగ్రత్త పడుతున్నాను' అని చెప్పింది. అయితే.. నయన్ మాటలతో కొందరైతే ఏకీభవించడంలేదు. అసలు తనకి పేరు తెచ్చిందే 'గజనీ' సినిమా. ఆ సినిమా గురించి నయన్ అలా మాట్లాడటం తగదని కొందరు అభిప్రాయపడుతున్నారు.



## కలి పురుషుడిపై కల్కి పోరాటం

ఇప్పటివరకూ వచ్చిన భారతీయ సినిమాలన్నీ ఒకెత్తు.. 'కల్కి 2898' ఒకత్తు అనేలా ఉంది శుక్రవా రం విడుదలైన ట్రైలర్. 'భగవంతుడి లోపల సమస్త సృష్టి ఉందంటారు.. అలాంటిది, మీ కడుపులో ఆ భగవంతుడే ఉన్నాడు..' అంటూ అశ్వత్థామగా అమితాబ్ చెప్పిన డైలాగ్‌తో ట్రైలర్ మొదలైంది. దైవాన్ని గర్భాన మోస్తున్న దీపికను, ఆమె గర్భస్థ శిశువును కలి బారినుండి కాపాడటమే లక్ష్యంగా పెట్టుకున్న అశ్వత్థామను ఈ ట్రైలర్‌లో చూడొచ్చు. కలియుగాంతంలో కలి పురుషుని దారుణాలు భరించలేక, మాధవుని ఆగమనం కోసం ఎదురుచూస్తున్న అభాగ్యుల ఆక్రందనలు ఈ ట్రైలర్‌లో చూడొచ్చు. 'రేపటి కోసం' జనం ఎదురుచూస్తుంటే, 'ఈ రోజును చంపితే రేపెలా ఉంటుంది?' అంటూ కలి పురుషుడు చేసే వికటాట్టహాసాన్నీ, విఫలయత్నాన్నీ ఈ ట్రైలర్‌లో చూడొచ్చు. 'ఎన్ని యుగాలైనా ఎన్ని అవకాశాలిచ్చినా మనిషి మారడు.. మారలేదు..' అని నిర్భయం.. నిక్కచ్చిగా చెబుతున్న కలి పురుషుడి విచిత్రరూపంలో కమల్‌హాసన్‌ని ఈ ట్రైలర్‌లో చూడొచ్చు. ఏదోఒకటి చేసి సకల సౌకర్యాలుండే 'కాంప్లెక్స్'కి వెళ్లిపోవాలని ప్రయత్నించే భైరవ ఎవరు? భైరవకీ అశ్వత్థా మకూ మధ్య యుద్ధం ఎందుకొచ్చింది? ఇలా ఎన్నో ప్రశ్నలు ఉత్పన్నమయ్యేలా ఈ ట్రైలర్ ఉంది. మొత్తంగా మన పురాణాలకు హాలీవుడ్ సొగబులద్ది, ఓ కొత్తలోకాన్ని ట్రైలర్‌లో ఆవిష్కరించాడు దర్శకుడు నాగ్‌అశ్విన్. 'ఇప్పటివరకూ ఒక్క ఫైట్ కూడా ఓడిపోలేదు.. ఇది కూడా ఓడిపోను..' అనే డైలాగ్ నాగ్‌అశ్విన్ కోసమే రాసినట్టుంది. ప్రభాస్, అమితాబ్, కమల్‌హాసన్, దీపిక పదుకొనే, శోభన, మాళవిక నాయర్.. పాత్రలు ట్రైలర్‌లో ఆసక్తిని రేకెత్తించాయి. ఈ నెల 27న విడుదల కానున్న పాన్ వరల్డ్ మూవీ 'కల్కి 2898'ను ప్రతిష్టాత్మక వైజయంతీ మూవీస్ సంస్థ నిర్మించిన విషయం తెలిసిందే.





## పీరియాడికల్ యాక్షన్ డ్రామా

'విరూపాక్ష' విజయంతో వందకోట్ల హీరోగా అవతరించారు సాయిదుర్గతేజ్. ఆయన హీరోగా ఓ పాన్ ఇండియా సినిమా ఇటీవలే మొదలైంది. అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి రోహిత్ కేపీ దర్శకుడు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమాకు సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. అదో ఎడారి.. దాని నిండా ల్యాండ్‌మైన్‌లు.. మధ్యలో పచ్చని చెట్టు.. అందర్నీ ఆకర్షించేలా పోస్టర్ ఉంది. యూనివర్సల్ కాన్సెప్ట్‌తో సినిమా రూపొందుతున్నదని, గ్రాండ్ స్కేల్‌తో, భారీ బడ్జెట్‌తో సినిమాను తెరకెక్కించ నున్నామని, పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సా యిదుర్గతేజ్ పాత్ర చాలా శక్తివంతంగా ఉంటుందని నిర్మాతలు తెలిపారు. ఈ సినిమాకోసం వేసిన భారీ సెట్‌లో తొలిషెడ్యూల్ జరుగుతోంది. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సివుంది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com